దరఖాస్తులను పరిష్కరించాలి

- కలెక్టర్ బీ సత్యప్రసాద్
- ప్రజావాణిలో 59 ఫిర్యాదుల స్వీకరణ

దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, ఇతర అధికారులు

జగిత్యాల రూరల్, జూన్ 16: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యమిచ్చి క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ బీ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గల ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బీ సత్యప్రసాద్ మాట్లాడుతూ, సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని, అధికారులు శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా, ప్రజావాణిలో 59 ఫిర్యాదులు, వినతులు వచ్చినట్లు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఆర్డీవోలు మధుసూదన్, జీవాకర్ రెడ్డి, శ్రీనివాస్, జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబసభ్యులు తిండి పెట్టడం లేదు



మాది ఓగులాపూర్ గ్రామం. కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. తనకు భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. రోజూ కూలీ పని చేసి ఇంటికి వెళ్తే రానివ్వడం లేదని, తిండి కూడా పెట్టడం లేదు. తనకున్న రెండెకరాల భూమిని తన భార్య లక్ష్మి పేరు మీద రిజిస్ట్రేషన్ చేసిన. మరో రెండెకరాల పొలానికి సంబంధించిన పేపర్లు ఇవ్వకుండా, తిండి పెట్టకుండా కొడుకులు, భార్య బాధిస్తున్నారని వాపోయాడు.

-వేములవాడ గంగాధర్, ఓగులాపూర్, మల్లాపూర్ మండలం

పింఛన్ ఇప్పించండి సారూ..

నాపేరు నోముల బుచ్చిగంగు, వయస్సు 78 సంవత్సరాలు. భర్త పెద్ద గంగారెడ్డి మృతిచెందాడు. 2021 నుంచి వికలాంగుల పింఛన్ వస్తుండే. 2023లో రెన్యూవల్ చేసుకోమంటే కళ్లు సరిగ్గా కనిపించక, వెన్నెముక విరిగి మంచానికే పరిమితమై చేసుకోలేదు. నాకు ఎలాంటి ఆధారం లేదు. తిండికి ఇబ్బందులు పడుతున్నా. నాకు పింఛన్ ఇప్పించాలని కలెక్టర్‌ను వేడుకుంది.

-నోముల బుచ్చిగంగు, కొత్తదాంరాజీపల్లి, మల్లాపూర్ మండలం

పురుగుల మందు డబ్బాలతో రైతుల నిరసన

పురుగుల మందు డబ్బాలతో కలెక్టరేట్‌కు వచ్చిన రైతులు

కొండాపూర్ శివారులోని బూరుకుంట చెరువు కట్టను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన రైతులు పురుగుల మందు డబ్బాలతో కలెక్టరేట్‌కు వచ్చి నిరసన తెలిపారు. అధికారులు తమ సమస్యను పరిష్కరించకపోతే పురుగుల మందే మాకు దిక్కని, ఏడు నెలల క్రితం చెరువు కట్టను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో దరఖాస్తు చేశామన్నారు. కలెక్టర్ చొరవ తీసుకొని చెరువు కట్టకు మరమ్మతులు చేయడానికి అధికారులను గ్రామానికి పంపిస్తే, కట్ట ధ్వంసం చేసిన వ్యక్తి పురుగుల మందు తాగి చస్తానని బెదిరించడంతో అధికారులు వెనుదిరిగినట్టు తెలిపారు. ఈ విషయమై మిగతా గ్రామస్తులు, ఎస్ఐ, డీఎస్పీ, ఆర్డీవో, ఎస్సారెస్పీ, ఈఈని కలిసినా ఫలితం లేదు. కట్టను ధ్వంసం చేయడంతో తాము పంటలు వేసుకోలేని పరిస్థితి నెలకొందని, మరమ్మతులు చేపట్టాలని కోరారు. కట్టను ధ్వంసం చేసి పురుగుల మందుతో బెదిరిస్తున్న వ్యక్తికి అధికారులు భయపడొద్దని, తాము 20 మంది రైతులు ఉన్నామని, మేము కూడా పురుగుల ముందు డబ్బాలతో వచ్చి కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్నట్లు చెప్పారు.

బాధితులకు అండగా ఉంటా

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల, జూన్ 16: విద్యుత్ ప్రమాద బాధితులకు అండగా ఉంటానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల భరోసా ఇచ్చారు. కోరుట్ల పట్టణంలో గణేశ్ విగ్రహాల తయారీ కేంద్రంలో ఆదివారం భారీ గణేశ్ విగ్రహాన్ని తరలిస్తున్న క్రమంలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రాజేశ్, కృష్ణ, రోహిత్, హనుమంతు, ఆకాశ్ హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖానలో చికిత్స పొందుతున్నారు. కాగా, దవాఖానలో బాధితులను సోమవారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఎమ్మెల్యే అండగా ఉంటానని భరోసానిచ్చారు. విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబసభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సామూహిక అక్షరాభ్యాసం

రాయికల్/మల్యాల, జూన్ 16: రాయికల్ పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు బడిబాటలో భాగంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మచ్చ శేఖర్, మ్యాకల రమేశ్, బత్తిని భూమయ్య, కడకుంట్ల నరేశ్, కట్ల నర్సయ్య, కటకం కళ్యాణ్, కొత్తపెల్లి రంజిత్, బెక్కెం తిరుపతి, ప్రధానోపాధ్యాయుడు గట్టు రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే, మల్యాల మండలం తక్కళ్లపల్లిలో బడిబాట నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో విద్యాశాఖ అధికారులు సమావేశం ఏర్పాటు చేసి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి రాజేశం, ఎంఈవో జయసింహారావు, హెచ్ఎంలు కరీం, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

సుమన్ కుటుంబాన్ని ఆదుకుంటాం

సుమన్ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

మల్యాల, జూన్ 16: మల్యాల మండలం గొల్లపల్లె బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఎనగందుల సుమన్ ఇటీవల మృతి చెందాడు. కాగా, నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం జగిత్యాలకు వెళ్తున్న క్రమంలో మల్యాల ఎక్స్‌రోడ్ వద్ద సుమన్ కుటుంబ సభ్యులను కలిశారు. అధైర్య పడొద్దని, పార్టీ తరపున ఆదుకుంటామని బాధిత కుటుంబానికి భరోసానిచ్చారు. ఆమె వెంట నాయకులు దావ సురేశ్, మొత్కు కొమురయ్య, రియాజ్ తదితరులున్నారు.

హైదరాబాద్‌కు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

చల్మెడ లక్ష్మీనరసింహారావుతో బీఆర్ఎస్ నాయకులు

మేడిపల్లి, జూన్ 16: ఏసీబీ విచారణకు వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మద్దతుగా పార్టీ ఉమ్మడి మేడిపల్లి మండల శ్రేణులు సోమవారం హైదరాబాద్‌కు తరలి వెళ్లారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వేములవాడ నియోజవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావును కలిసి రాజకీయ పరిస్థితులు గురించి మాట్లాడారు. తరలి వెళ్లిన వారిలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సత్తిరెడ్డి, మాజీ ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు రవీందర్‌రావు, మాజీ సర్పంచులు సురేశ్, చారి, మాజీ ఎంపీటీసీ మకిలి దాస్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు షేక్ హైమద్, నాయకులు అజిత్‌రావు, ఆదిరెడ్డి, సురేందర్ రావు, ఎండీ రాజబోస్, మహ్మద్ అజీమొద్దీన్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కోరుట్ల, జూన్ 16: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్ సూచించారు. పట్టణంలోని 17, 18, 26వ వార్డుల్లో సోమవారం ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఇంటి పరిసరాల్లో నీరు నిలిచి ఉండకుండా చూసుకోవాలన్నారు. అనంతరం మురుగు కాలువల్లో దోమల నివారణకు పారిశుధ్య కార్మికులు రసాయనాలను స్ప్రే చేశారు. ఇండ్ల పరిసరాల్లో పూల కుండీలు, డ్రమ్ములు, టైర్లలో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్, బాలె అశోక్, మెప్మా సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందజేత

మెట్‌పల్లి రూరల్, జూన్ 16: వేంపేట శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం 336 మంది ఇందిరమ్మ లబ్ధిదారులకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఇండ్ల మంజూరు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అంజిరెడ్డి, మెట్‌పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ లింగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కోరుట్ల, జూన్ 16: పేదలకు సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందని వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో సోమవారం ఆయన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావుతో కలిసి లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. అంతకుముందు పట్టణ శివారు వెటర్నరీ కళాశాల సమీపంలో క్రీడా మైదానం కోసం కేటాయించిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. కోరుట్లలో క్రీడా మైదానం ఏర్పాటు కోసం ఐదెకరాల ప్రభుత్వ స్థలాన్ని మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డీవో జీవాకర్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణచైతన్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పన్నాల అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

జగిత్యాల టౌన్, జూన్ 16: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు సోమవారం విడుదలైనట్లు జిల్లా నోడల్ అధికారి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరం జనరల్ బాలుర విభాగంలో 1742 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 983 మంది ఉత్తీర్ణత సాధించారు. దీంతో 56.43 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికల జనరల్ విభాగంలో 2119 మంది విద్యార్థులకు గానూ 1590 మంది ఉత్తీర్ణులు కాగా, 75.04 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొత్తం 3861 మంది విద్యార్థులకు గానూ 2573 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా, 66.64 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అలాగే, ద్వితీయ సంవత్సరం జనరల్ బాలుర విభాగంలో 1239 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 671 మంది ఉత్తీర్ణులు కాగా, 54.16 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికల జనరల్ విభాగంలో 835 మంది విద్యార్థులకు గాను 463 మంది ఉత్తీర్ణులు కాగా, 55.45 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొత్తం 2074 మంది విద్యార్థులకు గానూ 1134 మంది ఉత్తీర్ణులు కాగా, 54.68 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రథమ సంవత్సరం ఒకేషనల్ బాలుర విభాగంలో 280 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 170 మంది ఉత్తీర్ణులయ్యారు. 60.71 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికల విభాగంలో 89 మంది విద్యార్థులకు గానూ 68 మంది ఉత్తీర్ణులు కాగా, 76.4 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొత్తం 369 మంది విద్యార్థులకు గానూ 238 మంది ఉత్తీర్ణులు కాగా 64.5 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ బాలుర విభాగంలో 269 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 175 మంది ఉత్తీర్ణులు కాగా, 65.06 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికల విభాగంలో 56 మంది విద్యార్థులకు గానూ 28 మంది ఉత్తీర్ణులు కాగా, 50 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొత్తం 325 మంది విద్యార్థులకు గానూ 203 మంది ఉత్తీర్ణులు కాగా, 62.46 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

గాయత్రి అర్బన్ బ్యాంక్ పాలక వర్గం ఎన్నిక

జగిత్యాల, జూన్ 16: గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలక వర్గం ఎన్నిక సోమవారం నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా సహకార అధికారి సీహెచ్ మనోజ్ కుమార్ వ్యవహరించారు. కేంద్ర సహకార ఎన్నికల సంఘం ధృవీకరణ అనంతరం నూతన పాలక మండలి ఎన్నిక ఫలితాలను వెల్లడిస్తారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి

సారంగాపూర్, జూన్ 16: ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ సెంటర్లలో చేర్పించాలని ఐసీడీఎస్ ధర్మపురి సీడీపీవో వాణిశ్రీ పేర్కొన్నారు. సారంగాపూర్ మండలం అర్పల్లి, బీర్‌పూర్ మండలం రేకులపల్లి గ్రామాల్లో గల అంగన్‌వాడీ సెంటర్లలో సోమవారం అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లత, శైలజ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల భవిష్యత్‌కు అంగన్‌వాడీలే పునాది

కథలాపూర్, జూన్ 16: చిన్నారుల ఉజ్వల భవిష్యత్‌కు అంగన్‌వాడీ కేంద్రాలే పునాదులు అని విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కథలాపూర్ మండలం గంభీర్‌పూర్, దూలూర్, సిరికొండ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణ పనులకు సోమవారం ఆయన భూమిపూజ చేశారు. భూషణరావుపేటలో పల్లె దవాఖాన భవనం నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం భూషణరావుపేట శివారులోని రాళ్లవాగు ప్రాజెక్టు కాలువను పరిశీలించి, పిచ్చి మొక్కలను తొలగించాలని అధికారులకు సూచించారు. భూషణరావుపేటలో పల్లె దవాఖాన భవనం కోసం ఉచితంగా స్థలాన్ని ఇచ్చిన బీఆర్ఎస్ నేత గడ్డం భూమారెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్, జిల్లా సంక్షేమాధికారి నరేశ్, సీడీపీవో మణెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించడమే లక్ష్యం

ఇబ్రహీంపట్నం, జూన్ 16: విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించడమే ఉపాధ్యాయుల లక్ష్యమని కోమటికొండాపూర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బడిబాటలో భాగంగా సోమవారం ఎఫ్ఎల్ఎన్-ఎల్ఐపీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు రాధిక, ఉపాధ్యాయులు సుధారాణి, విశాల్, నర్మద, రాసూరి రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మల్లాపూర్, జూన్ 16: గ్రామాల్లోని ప్రజలు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మెట్‌పల్లి డిపో మేనేజర్ దేవరాజ్ కోరారు. మండలంలోని ముత్యంపేట గ్రామంలో సోమవారం ఆయన గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ దేవరాజ్ మాట్లాడుతూ, నూతనంగా ఖానాపూర్ నుంచి ఆర్మూర్ మీదుగా హైదరాబాద్‌కు లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్

శృతి

కథలాపూర్, జూన్ 16: సోమవారం విడుదలైన ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో కథలాపూర్ మండల ఊట్‌పల్లి గ్రామానికి చెందిన శృతి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. ఎంపీసీలో 470 మార్కులకు 468 మార్కులు పొందింది. ఈ విషయాన్ని కోరుట్ల మాస్ట్రో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల రాజేశ్ తెలిపారు. శృతికి ఏప్రిల్‌లో విడుదలైన ఫలితాల్లో 463 మార్కులు వచ్చాయని, మళ్లీ ఫీజు చెల్లించి ఇంప్రూవ్‌మెంట్ రాయగా మరో 5 మార్కులు పెరిగి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ వచ్చిందని చెప్పారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

కోరుట్ల, జూన్ 16: కోరుట్లలో లారీని ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో పది మంది ప్రయాణీకులు గాయాలయ్యాయి. స్థానికులు, ఆర్టీసీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కోరుట్ల డిపోకు చెందిన బస్సు (టీజీ 21 జెడ్ 0011) నిజామాబాద్ నుంచి జగిత్యాల వైపు వెళ్తుండగా పట్టణంలోని కొత్త బస్టాండ్ అంబేద్కర్ చౌక్ ఆర్టీసీ అవుట్ గేట్ సమీపంలో అదుపు తప్పి ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. బస్సులో మొత్తం 29 మంది ప్రయాణిస్తుండగా, పదిమందికి గాయాలయ్యాయి. బస్సు ముందు భాగం అద్దాలు ధ్వంసం కాగా ప్రయాణికులకు నుదురు, తల భాగంలో స్వల్ప గాయాలయ్యాయి. కాగా, లారీ డ్రైవర్ సడెన్‌గా బ్రేక్ వేయడం వల్ల ప్రమాదం జరిగిందని ఆర్టీసీ డ్రైవర్ లక్ష్మణ్ ఆరోపించాడు. స్థానికులు బాధితులను ప్రభుత్వ దవాఖానకు తరలించగా, వైద్యులు చికిత్స చేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కోరుట్ల, జూన్ 16: పట్టణ శివారులో జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి మండలం పెద్దాపూర్‌లోని ఓ రైస్ మిల్లులో పని చేస్తున్న ప్రకాశ్, మోహన్ ద్విచక్ర వాహనంపై సోమవారం కోరుట్లకు వచ్చారు. వంట సామగ్రి కొనుగోలు చేసి తిరుగు ప్రయాణమయ్యారు. మెట్‌పల్లి నుంచి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును వీరు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ మోహన్‌ను జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించగా, ప్రకాశ్‌కు కోరుట్లలోని ఏరియా దవాఖానలో చికిత్స అందించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాను అగ్రస్థానంలో నిలుపాలి

జగిత్యాల, జూన్ 16: అధికారులంతా సమన్వయంతో పని చేసి జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ బీ సత్యప్రసాద్ పేర్కొన్నారు. జగిత్యాల కలెక్టర్‌గా సత్యప్రసాద్ బాధ్యతలు స్వీకరించి సోమవారం నాటికి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయనకు జిల్లా ఉన్నతాధికారులు, కలెక్టరేట్, వివిధ శాఖల ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు, అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పారదర్శకంగా అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఆర్డీవోలు మధుసూదన్, జీవాకర్ రెడ్డి, డీఆర్డీవో రఘువరన్, ఎస్సీ సంక్షేమాధికారి రాజ్ కుమార్, డీపీవో మదన్‌మోహన్, పరిశ్రమల శాఖ అధికారి ఎంజీ యాదగిరి, కలెక్టరేట్ ఏవో హకీమ్ పాల్గొన్నారు.

జగిత్యాల టౌన్, జూన్ 16: జగిత్యాల కలెక్టర్‌గా బీ సత్యప్రసాద్ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా కలెక్టరేట్‌లోని కార్యాలయంలో ఆయనను టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు మిర్యాల నాగేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు కలిసి పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంతో ఉద్యోగులు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో నాయకులు సాహెద్‌బాబు, రవీందర్, సుగుణాకర్, మధుకర్, ప్రమోద్, కిరణ్, నగేష్, నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు అరుణ, నారాయణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్

మెట్‌పల్లిటౌన్, జూన్ 16: పట్టణంలో తాగునీటిని సరఫరా చేసే మంచినీటి ట్యాంకులను మున్సిపల్ కమిషనర్ మోహన్ ఆదేశాల మేరకు సిబ్బంది సోమవారం క్లోరినేషన్ చేశారు. ట్యాంకుల లోపల శుభ్రంగా కడిగారు. అలాగే, ఫిల్టర్‌బెడ్ వద్ద తాగునీటి క్లోరేషన్ శాతాన్ని పరిశీలించారు. పదిహేను రోజుల కోసారి ట్యాంక్‌లను శుభ్రపర్చాలని కమిషనర్ ఆదేశించారు. అనంతరం 9వ వార్డులో తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఈ నాగేశ్వర్‌రావు, ఏఈ తిరుపతి, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ విష్ణు, ముజీబ్ పాల్గొన్నారు.

ఉరేసుకొని ఒకరి మృతి

కోరుట్ల రూరల్, జూన్ 16: మండలంలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన అగ్గ ఆశన్న(59) ఆదివారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆశన్న భార్య మల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

రాయికల్‌లో వైద్య శిబిరం

రాయికల్, జూన్ 16: రాయికల్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత షుగర్ నిర్ధారణ